'తెలంగాణ పాముల'ను కాపాడుతున్నదెవరు?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో జరిగిన వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో తెలంగాణ లింకులపై విచారణ ఎందుకు ముందుకు సాగడం లేదు? కార్పొరేషన్ నుంచి దారిమళ్లించిన రూ.45 కోట్లు హైదరాబాద్‌కు చేరాయని విచారణ సంస్థలు తేల్చినా లోతైన విచారణ ఎందుకు చేయడం లేదు? మొదట్లో సోదాలతో హడావుడి చేసిన దర్యాప్తు సంస్థలు ఇప్పుడు ఎందుకు హైదరాబాద్‌వైపే చూడటం లేదు? ఊరూపేరు లేని కంపెనీలకు డబ్బులు జమ కావడం, అందునా డబ్బులు జమ అయిన ఖాతాలన్నీ ఒకే బ్యాంకుకు చెందినవి కావడం అనుమానాలను బలపరుస్తున్నా దర్యాప్తు సంస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదు?.. వాల్మీకి స్కామ్ దర్యాప్తుపై ఎదురవుతున్న ప్రశ్నలివి. లోక్‌సభ ఎన్నికల ముందు ఈ డబ్బులు తెలంగాణకు చేరాయని, ఎన్నికల్లో వీటిని వినియోగించినట్టు అనుమానాలు ఉన్నప్పటికీ ఈ దిశగా విచారణ చేపట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అసలు, ఈ స్కామ్‌తో సంబంధమున్న తెలంగాణకు చెందిన వారిని ఎవరు కాపాడుతున్నారు, ఎందుకు కాపాడుతున్నారనేది అంతుచిక్కని ప్రశ్న.

ఆర్బీఎల్ బ్యాంకుకే రూ. 44.6 కోట్లు బదిలీ

వాల్మీకి కార్పొరేషన్ నుంచి దారిమళ్లిన మొత్తం రూ.187 కోట్లలో తెలుగు రాష్ట్రాలకు రూ.90 కోట్లు చేరినట్టు కర్ణాటక సిట్ అంతర్గత నివేదికలో వెల్లడించింది. ఇందులో రూ.44.6 కోట్లు హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు వివరించింది. సిట్ నివేదిక ప్రకారం.. వాల్మీకి కార్పొరేషన్ ఎండీ, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న జేజీ పద్మనాభ్, సస్పెండైన అకౌంట్స్ అధికారి పరశురామ్ బెంగళూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజీ రోడ్డు బ్రాంచీలో మార్చి 30, 2024న రూ.50 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ టర్మ్ డిపాజిట్‌పై అదే రోజు రూ. 45 కోట్ల మేర రుణానికి దరఖాస్తు చేశారు. ఇందులో నుంచి అదేరోజు హైదరాబాద్‌లోని ఆర్బీఎల్ బ్యాంకుకే చెందిన 9 బ్యాంకు ఖాతాలకు రూ.44.6 కోట్లను బదిలీ చేశారు.

ఖాతాలన్నీ నకిలీవే

డబ్బు జమ అయిన 9 ఆర్బీఎల్ బ్యాంకు ఖాతాలు నకిలీవని, కేవలం స్కామ్ డబ్బులు తరలించడానికే వీటిని తాత్కాలికంగా వినియోగించుకొన్నట్టు ఈడీ తెలిపింది. ప్రస్తుతం ఈ అకౌంట్‌లు క్రియాశీలంగా లేవని వెల్లడించింది. వాల్మీకి కార్పొరేషన్‌లో నిధులు పక్కదారి పట్టాయని సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే పేర్కొనడం గమనార్హం.

హైదరాబాద్‌లో కర్ణాటక వాల్మీకి స్కామ్ లింకులు..

- ఆర్బీఎల్ బ్యాంకుకు చెందిన 9 ఖాతాల్లో 45 కోట్లు జమ
- స్కామ్‌కు సంబంధించి రాష్ట్రంలో సిట్, సీబీఐ, ఈడీ సోదాలు
- సోదాల తర్వాత ఎలాంటి ప్రకటన విడుదల చేయని కేంద్ర ఏజెన్సీలు
- అనుమానాలు ఉన్నా లోతైనా విచారణ జరపని దర్యాప్తు సంస్థలు
- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్ విచారణలో రోజుకో కొత్త మలుపు
- నిందితులను తప్పించి.. బాధితులే లక్ష్యంగా సిట్ విచారణ
- సూసైడ్‌తో స్కామ్ గుట్టురట్టు చేసిన సూపరింటెండెంట్‌పై కేసు
- అతడే కీలక నిందితుడు అని పేర్కొంటూ సిట్ రెండో చార్జిషీట్
- అదే చార్జిషీట్‌లో ఎక్కడా కనిపించని ప్రధాన నిందితుల పేర్లు
- తన భర్తను కావాలనే ఇరికిస్తున్నారన్న మృతుడి భార్య కవిత

హైదరాబాద్‌లోని ఆర్బీ ఎల్ బ్యాంకులో ఏ కంపెనీ ఖాతాలో ఎంత డబ్బు జమ అయిందంటే??

కంపెనీ పేరు	జీఎస్టీఐఎన్/యూఐఎన్ నంబర్	ఖాతా నంబర్	జమ అయిన డబ్బు
సిస్టమ్ అండ్ సర్వీస్ కంపెనీ	29ఏడీఏఎఫ్ఎస్4751ఎ01జడ్ఎల్	00015010145200202	రూ. 4.55 కోట్లు
రామ్ ఎంటర్‌ప్రైజెస్	37ఏఏవీఎఫ్ఆర్5337ఏ1జడ్జడ్	00015010145200203	రూ. 5.07 కోట్లు
స్కిల్‌మ్యాప్ ట్రైనింగ్	---------------------	00015010145200204	రూ. 4.84 కోట్లు
స్వాప్ డిజైన్	27ఏటీఎన్‌పీసీ5821హెచ్1జడ్‌వో	00015010145200205	రూ. 5.15 కోట్లు
జీఎన్ ఇండస్ట్రీస్	36బీఏఎల్‌పీఏ6399సీ1జడ్ఎం	00015010145200206	రూ. 4.42 కోట్లు
నావెల్ సెక్యూరిటీ	29ఏడీవీపీఆర్2142ఎల్1జడ్‌టీ	00015010145200207	రూ. 4.56 కోట్లు
సుజల్ ఎంటర్‌ప్రైజెస్	---------------------	00015010145200208	రూ. 5.63 కోట్లు
గ్రాబ్ ఏ గ్రబ్	36ఏఏఎఫ్‌సీజీ7837ఎఫ్1జడ్ఎఫ్	00015010145200209	రూ. 5.88 కోట్లు
వీ6 బిజినెస్	---------------------	00015010145200210	రూ. 4.50 కోట్లు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని వాల్మీకి కార్పొరేషన్‌లో వెలుగు చూసిన రూ.187 కోట్ల స్కామ్ లింకులు తెలంగాణలో బయటపడటం సంచలనంగా మారింది. ఈ స్కామ్‌లోని మొత్తం డబ్బులో రూ.45 కోట్లు హైదరాబాద్‌కు తరలిరావడం, అందునా ఒక్క ఆర్బీఎల్ బ్యాంకులోని 9 ఖాతాల్లోనే ఆ డబ్బు జమ కావడం అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నది. ఈ స్కామ్ విషయమై గతంలో ఈడీ, సీబీఐ, సిట్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. అయితే, అనూహ్యంగా దానిపై ఏ ఏజెన్సీ ఏ ఒక్క ప్రకటన కూడా విడుదల చేయలేదు. దీంతో కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను కాపాడుతున్నదెవరన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. స్కామ్ జరిగిన మాట వాస్తవమే అయినప్పుడు, హైదరాబాద్‌కు నిధులు చేరాయన్నది కూడా నిజమే అయినప్పుడు ఆ డబ్బు ఎవరికి చేరింది? ఎందుకోసం ఈ డబ్బును వినియోగించారు? అనేది ఎందుకు విచారించడం లేదనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. మరోవైపు, కర్ణాటకలో ఈ స్కామ్ దర్యాప్తు తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు నిందితులను తప్పించి స్కామ్‌ను బయటపెట్టిన వ్యక్తినే కీలక నిందితుడిగా చేర్చడం కలకలం రేపుతున్నది.

నాగేంద్ర

చంద్రశేఖరన్

బసనగౌడ

సోదాలు చేశాక.. ఈడీ ప్రకటన ఏది?

వాల్మీకి కార్పొరేషన్ నుంచి హైదరాబాద్‌లోని తొమ్మిది ఆర్బీఎల్ బ్యాంకు ఖాతాలకు రూ.44.6 కోట్లు బదిలీ కాగా ఏపీలోని మరో 9 బ్యాంకు ఖాతాలకు మరో రూ.45 కోట్లు బదిలీ అయినట్టు ఈడీ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చేరిన రూ.44.6 కోట్ల నగదుతో లోక్‌సభ ఎన్నికల ముందు పెద్దయెత్తున మద్యం, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ స్కామ్‌కు సంబంధించి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈడీ, సీబీఐ, సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే, ఆ సోదాల్లో ఏం లభించాయన్న విషయంపై మాత్రం కేంద్ర ఏజెన్సీలు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

లోగుట్టు వాళ్లకే ఎరుక

ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కామ్‌కు పాల్పడిందని, స్కామ్‌లోని రూ.44.6 కోట్లు హైదరాబాద్‌కు చేరడాన్ని చూస్తే, ఇక్కడి కాంగ్రెస్‌కు కూడా ఈ స్కామ్‌తో సంబంధం ఉన్నట్టు అర్థమవుతున్నదని పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ స్కామ్‌ను విచారిస్తున్న కేంద్రప్రభుత్వ ఏజెన్సీ ఈడీ వైఖరి కూడా అనుమానాస్పదంగా ఉన్నది. దీంతో కేంద్రంలోని బీజేపీ, ఇరు రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పెద్దలు ఈ స్కామ్‌లోని అసలు నిజాలు బయటకు రాకుండా ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ స్కామ్ లోగుట్టు కాంగ్రెస్, బీజేపీ నేతలకే తెలుసునని సోషల్‌మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.

తొలుత ఈడీ దూకుడు

లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే 'వాల్మీకి కార్పొరేషన్' నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది. అయితే, నిధుల బదిలీని వాల్మీకి కార్పొరేషన్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ తొలుత వ్యతిరేకించడంతో ఆయన్ని తప్పించినట్టు సమాచారం. దీంతో ఆయన గత మే 26న ఆత్మహత్య చేసుకొన్నారు. అయితే, తన మరణ వాంగ్మూలంలో స్కామ్‌కు సంబంధించిన కీలక వివరాలను బయటపెట్టారు. దీంతో విచారణ జరిపిన ఈడీ.. కుంభకోణంలో భాగమైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, మరో ఇద్దరు బ్యాంకు అధికారులు సహా మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది.

బయటపెట్టిన వ్యక్తే.. స్కామ్‌కు పాల్పడుతాడా?

స్కామ్‌ను బయటపెట్టిన తన భర్తనే కీలక నిందితుడిగా చిత్రీకరించేందుకు కుట్రలు మొదలయ్యాయని సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ సతీమణి కవిత ఆరోపించారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి.. కవితను సంప్రదించినప్పుడు కీలక విషయాలు బయటకు వచ్చాయి. 'అసలు ఈ వాల్మీకి స్కామ్‌ను మొదటి నుంచి వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి నా భర్త పీ చంద్రశేఖరన్. అయితే, ఈ స్కామ్‌కు సహకరించాలని అందరూ ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అది ఇష్టంలేని ఆయన గత మేలో ఆత్మహత్య చేసుకొన్నారు. ప్రజాధనం వృథాగా పోవొద్దని సూసైడ్ నోట్‌లో ప్రధాన నిందితుల పేర్లతో సహా స్కామ్‌కు సంబంధించిన అన్ని వివరాలు పేర్కొన్నారు. అయితే, శివమొగ్గ జిల్లా కోర్టుకు గురువారం సిట్ సమర్పించిన రెండో చార్జిషీట్‌లో అసలు నిందితుల పేర్లు కనిపించలేదు. నా భర్తను కీలక నిందితుడిగా సిట్ తాజాగా చేర్చింది. ఆయన డబ్బు తీసుకొన్నట్టు అబద్ధపు ఆరోపణలు చేసింది. ఇది ఎంత అన్యాయం? స్కామ్‌ను బయటపెట్టిన వ్యక్తే.. ఎక్కడైనా ఆ స్కామ్‌కు పాల్పడుతాడా? దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తాం. ఈ స్కామ్ వెనుకున్న అసలు నిజాలు బయటకు రావాలంటే ఈ కేసు దర్యాప్తును ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలి' అని నమస్తే తెలంగాణ ప్రతినిధితో కవిత అన్నారు. కేసుకు సంబంధించి తనను కూడా విచారించాల్సిందిగా ఈడీ అధికారినంటూ ఒకరు తనకు ఫోన్ చేసినట్టు పేర్కొన్న కవిత.. కేసు తేలేవరకూ శివమొగ్గ వదిలి వెళ్లొద్దని తనతో చెప్పినట్టు వాపోయారు.

థ్రిల్లర్ సినిమాను మించిన ట్విస్టులు

'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ. 187 కోట్లు పక్కదారిపట్టాయి. దీన్నే 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్‌గా పిలుస్తున్నారు. నిజానికి ఈ స్కామ్ జరిగినట్టు ఎవరికీ తెలియదు. అయితే, చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కుంభకోణం వెలుగు చూసింది. వాల్మీకి కార్పొరేషన్ నుంచి చట్ట విరుద్ధంగా పలు బ్యాంకు ఖాతాలకు రూ.187 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారని చంద్రశేఖరన్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. స్కామ్‌లో భాగమైన నిందితుల పేర్లనూ లేఖలో ప్రస్తావించారు. దీనిపై సర్వత్రా ఒత్తిడి పెరుగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. ఈ కుంభకోణంపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది.

చివరకు విచారణ పక్కదారి

పభుత్వం ఏర్పాటు చేసిన సిట్ శివమొగ్గ జిల్లా కోర్టుకు గురువారం సమర్పించిన రెండో చార్జిషీట్ నివేదికలో అసలు నిందితుల పేర్లను తప్పించడం కలకలం రేపుతున్నది. వాల్మీకి కుంభకోణంలో ప్రధాన నిందితులైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) చీఫ్ మేనేజర్ సుచిస్మితా రావల్ పేర్లు సిట్ రెండో చార్జిషీట్‌లో కనిపించలేదు. స్కామ్‌ను బయటపెట్టిన చంద్రశేఖరన్‌ను నిందితుడిగా సిట్ కొత్తగా చేర్చింది. దీంతో ఈ విచారణ పక్కదారి పడుతున్నదని పలువురు విమర్శిస్తున్నారు.

మంత్రి మాటల్లో మర్మమేంటో?

కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు ఇచ్చినట్టే, తెలంగాణ సీఎం రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చంటూ కర్ణాటక పీడబ్ల్యూడీ మంత్రి సతీశ్ జార్కిహోళి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. వాల్మీకి సామాజిక వర్గంలో బలమైన నేతగా ఉన్న జార్కిహోళి.. తమ కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదంటూ ఆ వర్గం ప్రజలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఇదే విషయమై ఆయనపై పలు విధాలుగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో పెరుగుతున్న అసమ్మతిని చల్లార్చడానికి ఆయన చేయని ప్రయత్నంలేదు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చని జార్కిహోళి కీలక వ్యాఖ్యలు చేశారు. 'వాల్మీకి స్కామ్' కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకలో జరుగడం, అక్కడి డబ్బు తెలంగాణకు చేరడం, తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అధికారంలో ఉండటం, నోటీసుల గురించి 'వాల్మీకి' సామాజిక వర్గానికి చెందిన బలమైన నేత జార్కిహోళి సంచలన వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే.. ఈ స్కామ్‌లోనే సీఎంకు నోటీసులు వస్తాయా? అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌ను కాపాడుతున్న అదృశ్య శక్తి ఎవరు?

- **వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో తగిన ఆధారాలు ఉన్నా ఇక్కడ చర్యలెందుకు లేవు?**
- **తెలంగాణలో ఈడీ అధికారులు మౌనమెందుకు దాల్చారు?**
- **కర్ణాటక మంత్రి జార్కిహోళి వ్యాఖ్యల వెనుక అర్థమేంటి?**
- **ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నల వర్షం**
- **వాల్మీకి స్కామ్ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో చోటుచేసుకొన్న వాల్మీకి కార్పొరేషన్ స్కామ్ వ్యవహారంలో తెలంగాణ కాంగ్రెస్‌ను కాపాడుతున్న అదృశ్య శక్తి ఎవరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న ఈ కుంభకోణం వ్యవహారంలో తెలంగాణకు చెందిన రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలకు రహస్య లింక్ ఉన్నదనే వార్తలు వస్తున్నాయని, అయినా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కేటీఆర్ శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కోట్లాది రూపాయల ఈ కుంభకోణం, తెలంగాణ నాయకులకు దానితో ఉన్న లింకులకు సంబంధించి తగిన ఆధారాలు ఉన్నా రాష్ట్రంలో చర్యలు తీసుకోవడంలో ఈడీ ఎందుకు మౌనం దాల్చిందని నిలదీశారు. 'తెలంగాణలో కాంగ్రెస్‌ను కాపాడుతున్నది ఎవరు? ఏమైనా సమాధానం ఉందా?' అని కేటీఆర్ ఈడీని ప్రశ్నించారు. వాల్మీకి స్కామ్ వ్యవహారంలో తలెత్తుతున్న పలు ప్రశ్నలను ఆయన ఎక్స్(ట్విట్టర్) వేదికగా సంధించారు. వాటికి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేతలను డిమాండ్ చేశారు.

కేటీఆర్ సంధించిన ప్రశ్నలు ఇవీ..



- కర్ణాటక ఎస్టీ కార్పొరేషన్ నుంచి రూ.45 కోట్లు బదిలీ అయిన హైదరాబాద్‌లోని తొమ్మిది బ్యాంకు ఖాతాలు ఎవరివి?
- రూ.4.5 కోట్లు అందుకొన్న 'వీ6 బిజినెస్' యజమాని ఎవరు?
- కర్ణాటక వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌కు సంబంధించి తెలంగాణలో సిట్, సీఐడీ, ఈడీ దాడులు చేసిన తర్వాత కూడా సంబంధిత వార్తలు రాష్ట్ర మీడియాలో ఎందుకు బయటకు రానివ్వలేదు?
- లోక్‌సభ ఎన్నికల సమయంలో కొన్ని బార్లు, బంగారం దుకాణాల నుంచి భారీయెత్తున నగదు విత్‌డ్రా చేశారు. వాటి యాజమానులు ఎవరు? వారికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధం ఏంటి?
- వాల్మీకి స్కామ్‌లో రూ.90 కోట్ల అవినీతి జరిగిందని సాక్ష్యాత్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీ లోనే ఒప్పుకొన్నారు.
- ముఖ్యంగా కర్ణాటక సీఎంగా సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వం కూలిపోతుందంటూ ఆ రాష్ట్ర మంత్రి సతీశ్ జార్కిహోళి ఎందుకు వ్యాఖ్యానించారు? ఆ మాటల వెనుక అర్థం ఏంటి?
- ఈ స్కామ్‌కు సంబంధించి తగిన ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ, తెలంగాణలో ఈడీ ఎందుకు మౌనంగా ఉన్నది?
- ఇక్కడి కాంగ్రెస్‌ను కాపాడుతున్నది ఎవరు?
- ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయా? అంటూ కేటీఆర్ ఈడీని ప్రశ్నించారు.

10 వేల కోట్లతో 'విజ్ఞాన్ ధార'

- **బయో ఈ3 పాలసీకి ఆమోదం**
- **కేంద్ర మంత్రివర్గం నిర్ణయం**

న్యూఢిల్లీ, ఆగస్టు 24: విజ్ఞాన్ ధార పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఐటీశాఖ అమలు చేస్తున్న మూడు పథకాలను విలీనం చేసి 'విజ్ఞాన్ ధార' పేరుతో కొత్త పథకం తీసుకొచ్చింది. 15వ ఆర్థిక సంఘం కాలమైన 2021-22 నుంచి 2025-26 మధ్య రూ.10,579 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఈ పథకం కింద 11వ, 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, యూజీ, పీజీ, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ రిసెర్చ్ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందించనుంది. అధునాతన పరిశోధనల కోసం అంతర్జాతీయ భాగస్వామ్యం, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఫెలోషిప్‌లు వంటివి ఈ పథకంలో ఉంటాయి. ఆర్థిక, పర్యావరణ, ఉపాధి కోసం జీవసాంకేతిక విజ్ఞానం(బయో ఈ3) విధానానికి సైతం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్వచ్ఛ ఇంధన, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీ, పరిశోధన, ఈ రంగంలోని నూతన సాంకేతికత ప్రోత్సాహానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

కర్ణాటకలో సీఎం మార్పు?

- **కేసుల్లో కూరుకుపోతున్న సీఎం సిద్ధరామయ్య**
- **'సిద్ధూకు మద్దతు' అంటూనే ప్లాన్ బీ సిద్ధం చేస్తున్న కాంగ్రెస్ హైకమాండ్**
- **పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న డీకే**
- **హైకమాండ్ పరిశీలనలో పరమేశ్వర పేరు?**

శివకుమార్

పరమేశ్వర

బెంగళూరు, ఆగస్టు 24: కర్ణాటక కాంగ్రెస్‌లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వరుసగా కేసుల్లో కూరుకుపోతున్నారు. ముడా, వాల్మీకి స్కామ్‌లు ఆయన ముఖ్యమంత్రి పీఠానికి ఎసరు తెచ్చేలా ఉన్నాయి. దీంతో సీఎం పదవిపై కన్నేసిన నేతలు కుర్చీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవాల్సిన లేదా దింపేయాల్సిన పరిస్థితి వస్తే.. సీఎం కుర్చీని ఎవరికి అప్పగించాలనే దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్లాన్ బీ సిద్ధం చేస్తునట్టు తెలుస్తున్నది. సిద్ధరామయ్యకు తమ మద్దతు ఉంటుందని చెప్తూనే ప్రత్యామ్నాయ ప్రణాళికను రచిస్తున్నట్టు సమాచారం.

తెరపైకి హోంమంత్రి పరమేశ్వర పేరు

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి పదవిపై పీటముడి పడింది. ఈ పదవికి సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ చివరి వరకు పోటీ పడగా సిద్ధరామయ్య వైపు మెజారిటీ ఎమ్మెల్యేలు, అధిష్ఠానం మొగ్గు చూపింది. డీకేకు ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టింది. ఇప్పుడు సిద్ధరామయ్య సీఎం పీఠం కోల్పోయే పరిస్థితి వస్తే డీకే శివకుమార్‌కే దక్కుతుందని అంతా ఊహిస్తున్న సమయంలో అనూహ్యంగా హోంమంత్రి జీ పరమేశ్వర పేరు తెరపైకి వచ్చింది. దళిత నేత అయిన పరమేశ్వర పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నది. ఆయనను సీఎంను చేస్తే కర్ణాటకకు మొదటి దళిత ముఖ్యమంత్రి అవుతారు. 'నేను రాజకీయాల్లో ఉన్నాను. నేనేమీ సన్యాసిని కాను సీఎం పదవిని ఆశించకపోవడానికి' అంటూ ఈ పరిణామాలపై పరమేశ్వర స్పందించారు.

డీకేకు మళ్లీ హ్యాండేనా?

సీఎం పదవి కోసం డీకే శివకుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యులంతా ఢిల్లీ వెళ్లి హైకమాండ్‌ను కలిశారు. సిద్ధరామయ్య కర్ణాటక తిరిగి వచ్చినా డీకే మాత్రం ఢిల్లీలోనే మంత్రాంగం నడుపుతున్నారు. అయితే, ఈసారి కూడా డీకేకు కాంగ్రెస్ హైకమాండ్ హ్యాండిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయనకు సీఎం పదవి ఇచ్చేందుకు సిద్ధరామయ్య వర్గం వ్యతిరేకంగా ఉంది. సీనియర్ నేత సతీశ్ జార్కిహోళి సైతం శివకుమార్‌ను వ్యతిరేకిస్తున్నారు. వీరంతా ముఖ్యమంత్రిని మార్చొద్దని అంటున్నారు. ఒకవేళ మార్చాల్సి వస్తే శివకుమార్ బదులు జీ పరమేశ్వర పేరును ప్రతిపాదించేందుకు సిద్ధమవుతున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇదే జరిగితే డీకేకు మళ్లీ చుక్కెదురయ్యే చాన్స్ ఉంది. ఈ పరిణామాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత ఆర్ అశోక స్పందిస్తూ.. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం మ్యూజికల్ చైర్స్ ఆట మొదలయ్యిందని ఎద్దేవా చేశారు.

బేసిక్‌పై 50% పింఛన్

- **యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రకటించిన కేంద్రం**
- **చివరి 12 నెలల సగటు బేసిక్ పేపై 50% పెన్షన్**
- **2004 ఏప్రిల్ 1 తర్వాత చేరిన వారికి వర్తింపు**
- **23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం**
- **ఎన్‌పీఎస్‌లో కొనసాగడమా, యూపీఎస్‌లో చేరడమా అన్నది ఉద్యోగులే నిర్ణయించుకోవచ్చు**


మీడియాతో మాట్లాడుతున్న అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఉద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) పేరుతో కొత్త పింఛన్ పథకాన్ని శనివారం ప్రకటించింది. దీని ప్రకారం ఉద్యోగి తన పదవీ విరమణకు ముందు 12 నెలల్లో అందుకున్న బేసిక్ పే సగటులో 50 శాతం కచ్చితంగా పింఛన్ రూపంలో అందుతుంది. 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ కొత్త పింఛన్ పథకం వర్తిస్తుంది. 2004లో తీసుకువచ్చిన కొత్త పింఛన్ పథకాన్ని(ఎన్‌పీఎస్) రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2023 ఏప్రిల్‌లో కేంద్రం టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఒక కమిటీ వేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను ప్రభుత్వం రూపొందించింది. శనివారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకాన్ని ఆమోదించినట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

యూపీఎస్‌లోని 5 కీలక అంశాలు

కచ్చితమైన పింఛన్: కనీసం 25 ఏండ్ల సర్వీసు ఉన్న వారు కచ్చితమైన పింఛన్‌కు అర్హులు. వీరు పదవీ విరమణకు ముందు 12 నెలల పాటు అందుకున్న బేసిక్ పే సగటు 50 శాతం పింఛన్ రూపంలో ప్రతి నెల కచ్చితంగా అందుతుంది. కనీసం పదేండ్ల పైన, 25 ఏండ్లకు తక్కువ సర్వీసు చేసి పదవీ విరమణ పొందిన వారికి వారి సర్వీసుకు తగ్గట్టుగా పింఛన్ ఉంటుంది.

కచ్చితమైన కుటుంబ పింఛన్: ఉద్యోగి మరణించే నాటికి అందుకుంటున్న పింఛన్‌లో 60 శాతం కచ్చితమైన కుటుంబ పింఛన్‌గా ఉద్యోగి కుటుంబానికి అందుతుంది.

కచ్చితమైన కనీస పింఛన్: కనీసం పదేండ్ల సర్వీసు ఉండి రిటైర్ అయిన వారికి కనిష్ఠంగా రూ.10,000 కచ్చితంగా పింఛన్ అందుతుంది.

ద్రవ్యోల్బణ ఇండెక్సేషన్: కచ్చితమైన పింఛన్, కచ్చితమైన కుటుంబ పింఛన్, కచ్చితమైన కనీస పింఛన్‌పై ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇది డియర్‌నెస్ రిలీఫ్ ఆల్ ఇండియా కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్(ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ)పై ఆధారపడి ఉంటుంది.

పదవీ విరమణ సమయంలో..

గ్రాట్యూటీకి అదనంగా పదవీవిరమణ సమయంలో ఉద్యోగులకు కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. ప్రతి ఆరు నెలల సర్వీసు పూర్తిపై నెల వేతనం(పే + డీఏ)లో పదో వంతును లెక్కగట్టి ఇస్తుంది. ఈ చెల్లింపు కచ్చితమైన పింఛన్ మొత్తాన్ని తగ్గించదు.

ఎన్‌పీఎస్‌కు, యూపీఎస్‌కు తేడా ఏంటి?



కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉద్యోగులకు ఎన్‌పీఎస్ అమలు చేస్తున్నది. దీంట్లో కచ్చితంగా ఇంత మొత్తం పింఛన్ అందుతుందనే హామీ లేదు. ఉద్యోగి తన సర్వీసులో పింఛన్ కోసం అందించిన కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వం పెట్టుబడిగా పెట్టి, దానిపై వచ్చే రిటర్న్స్‌పై పింఛన్ ఆధారపడి ఉంటుంది. యూపీఎస్ అంటే కచ్చితంగా ఇంత పింఛన్ అందుతుందనే హామీ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉంటుంది.

యూపీఎస్ ఎవరికి?

ఎన్‌పీఎస్‌లో కొనసాగడమా? కొత్తగా యూపీఎస్‌లో చేరడమా అనేది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే నిర్ణయించుకోవచ్చని అశ్వినీ వైష్ణవ్ స్పష్టత ఇచ్చారు. ఇది 2004లో ఎన్‌పీఎస్‌ను అమలులోకి తీసుకొచ్చినప్పటి నుంచి యూపీఎస్ అమలులోకి వచ్చే ముందురోజైన 2025 మార్చి 31 వరకు పదవీ విరమణ పొందిన వారికి, పొందబోయే వారికి కూడా వర్తిస్తుందని క్యాబినెట్ కార్యదర్శిగా ఎంపికైన టీవీ సోమనాథన్ తెలిపారు. ఇందుకుగానూ వారు అందుకున్న పింఛన్, యూపీఎస్ ప్రకారం అందాల్సిన పింఛన్‌ను సర్దుబాటు చేసి బకాయి ఉంటే చెల్లించనున్నట్టు చెప్పారు.

కోర్టు ఆదేశించినా విచారించరా?

- **సీఎం సిద్ధరామయ్యపై 'లంచం' ఆరోపణలు**
- **విచారణ నిర్వహించని లోకాయుక్త పోలీసులు**
- **నోటీసులు జారీ చేసిన ప్రజాప్రతినిధుల కోర్టు**



బెంగళూరు: వాల్మీకి స్కామ్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు మరిన్ని చిక్కులు తప్పేలా లేవు. ఆయనపై నమోదైన 2014నాటి ముడుపుల కేసులో లోకాయుక్త పోలీసుల తీరుపై ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు ఆదేశించినప్పటికీ పట్టించుకోకపోవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సిద్ధరామయ్య మొదటిసారి సీఎంగా ఉన్నప్పుడు 2014 జూలై 28న మైసూరులోని వివేక్ హోటల్స్ ఎండీ వివేకానంద అలియాస్ కింగ్స్ కోర్టు వివేక్ వద్ద నుంచి రూ.1.3 కోట్ల చెక్కును లంచంగా తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. బెంగళూరు టర్ఫ్ క్లబ్ లిమిటెడ్‌కు స్టెవార్డ్‌గా నియమించేందుకు ముడుపులు తీసుకున్నారని ఆరోపణ. ఈ కేసులో క్విడ్ ప్రోకో జరగలేదని పేర్కొంటూ గత ఏడాది జూన్ 7న కర్ణాటక లోకాయుక్త డిప్యూటీ ఎస్పీ కోర్టులో కేసు క్లోజర్ రిపోర్టును సమర్పించారు.

ఆరు నెలలైనా విచారణ ప్రారంభించలే

లోకాయుక్త నివేదికను సవాల్ చేస్తూ బీబీఎంపీ మాజీ కౌన్సిలర్ రమేశ్ కోర్టును ఆశ్రయించారు. మరోసారి విచారణ జరపాలని ప్రత్యేక కోర్టు ఫిబ్రవరి 21న లోకాయుక్త ఎస్పీని ఆదేశించింది. ఆరు నెలలైనా కేసులో విచారణ జరగలేదు. కోర్టు ఉత్తర్వులపై సమాచారం లేదని, అందుకే విచారణ జరపలేదని విచారణ అధికారి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్.. లోకాయుక్త పోలీసులకు షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణను సెప్టెంబరు 12కు వాయిదా వేశారు.